***RELEASED FROM***

***CPI(M) State Office***
H.No. 27-28-12, Yamalavari Street,
Governor Pet, Vijayawada -2
PH 0866 - 2577202, Fax : 0866-2577203.
E-mail: cpimap@gmail.com

# వామపక్ష పార్టీలు

**విజయవాడ,**
**తేది : 13 మే, 2020.**

**శ్రీయుత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గారికి,**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము,
వెలగపూడి.

**ప్రచురణార్థం:** ఈరోజు వామపక్ష పార్టీలు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం.
**– జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి, వామపక్ష పార్టీల తరఫున

**విషయం : కేంద్ర విద్యుత్ చట్టం సవరణ బిల్లు ప్రతిపాదనలను తిరస్కరించాలని కోరుతూ...**

**ఆర్యా!**

సామాన్య ప్రజల ప్రయోజనాలకు హానికరంగానూ, రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను హరించే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'విద్యుత్ చట్ట సవరణ బిల్లా2020'ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరస్కరించాలని కోరుతున్నాము. విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించేలా రూపొందించిన ఈ బిల్లును తక్షణం ఉపసంహరించుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేస్తున్నాము. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులో చేసిన ప్రతిపాదనలు భారత రాజ్యాంగంలోని 'సమాఖ్య సూత్రాలపై' నేరుగా దాడి చేస్తూ, మరింత అధికార కేంద్రీకరణ దిశగా ఉన్నాయి.

విద్యుత్ ఛార్జీలు నిర్ణయించే పద్ధతిని మార్చేస్తూ సవరణలు తెచ్చారు. ప్రస్తుతం పరిశ్రమలు, వాణిజ్య వినియోగదార్ల నుండి కొంత ఎక్కువ రేటును వసూలు చేసి, అల్పాదాయ వర్గాలకు, సామాజిక వినియోగానికీ తక్కువ రేటుకు సరఫరా చేస్తున్నారు. పై తరగతుల నుండి ఎక్కువ వసూలు చేసి ఆ మిగులుతో కింది తరగతులవారికి చౌకగా సరఫరా చేసే ఈ క్రాస్ సబ్సిడైజేషన్ విధానాన్ని తొలగించాలని కేంద్రం ప్రతిపాదించింది. రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సబ్సిడీ, క్రాస్ సబ్సిడైజేషన్ లేకుండా కాస్ట్ టు సెర్వ్ (విద్యుత్ కొనుగోలు, ప్రసారం, పంపిణీ ఖర్చులన్నీ కలిపి అయ్యే) రేటుకే విద్యుత్ ఛార్జీలు నిర్ణయించాలని ఈ సవరణలు నిర్దేశిస్తున్నాయి. ఈ ఏడాది రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ అంగీకరించిన కాస్ట్ టు సెర్వ్ రూ.6.87లు. కాబట్టి ఈ లెక్క ప్రకారం కేంద్ర ప్రతిపాదన అమలు చేస్తే రాష్ట్రంలో అందరు వినియోగదారుల నుండీ యూనిట్‌కు రూ.6.87 చొప్పున వసూలు చేయాలి. అంటే రాష్ట్రంలో సుమారు 16 లక్షల వ్యవసాయ పంప్‌సెట్లకు ఇస్తున్న ఉచిత విద్యుత్ ఇకపై వుండదు. ఆత్మహత్యలు, ఆకలి చావులతో కొట్టుమిట్టాడుతున్న సాధారణ రైతాంగానికి ఆమాత్రం ఊరట కూడా లేకుండా పోతుంది.

ఎస్‌సి, ఎస్‌టి గృహస్తులకు, చేనేత కార్మికులకు, స్వర్ణకారులకు, క్షౌరశాలలకు, దోభీ ఘాట్లకు, సెలూన్లకు కొన్ని పరిమితులతో ఇప్పుడిస్తున్న ఉచిత విద్యుత్ ఇకపై ఉండదు. 200 యూనిట్ల లోపు వాడే గృహ వినియోగదార్లందరూ కూడా ఇప్పుడు పొందుతున్న రాయితీని కోల్పోతారు. చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు పొందుతున్న రాయితీలు కూడా రానున్న కాలంలో కొనసాగే అవకాశం ఉండదు. తద్వారా అధిక సంఖ్యలో ఉపాధి కల్పిస్తున్న అసంఘటిత రంగం కూడా చిక్కుల పాలవుతుంది. మరోవైపు భారీ హోర్డింగులకు వాడే విద్యుత్‌కు ఇప్పుడు నిర్ణయించిన రూ.12.25, అలాగే నెలకు 500 యూనిట్లు పైబడి వాడే వాణిజ్య వినియోగదార్లు చెల్లిస్తున్న రూ.9.95 స్థానే ఇకపై యూనిట్‌కు రూ.6.87 చెల్లిస్తే సరిపోతుంది. భారీ పరిశ్రమలకు, సంపన్నులకు ఛార్జీ తగ్గించి, సామాన్యులపై భారం పెంచుతారన్నమాట. రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ ఇవ్వదలిస్తే దాన్ని నగదు బదిలీగా ఆయా వినియోగదార్ల అకౌంట్లకు జమ చేయాలని కేంద్రం చెబుతోంది. ఇప్పటికే జిఎస్‌టితోనూ, ఆర్థికసంఘం నిధుల బదలాయింపులో సొంత వనరులు కోల్పోయి కునారిల్లుతున్న రాష్ట్ర ప్రభుత్వాలపై ఇది అదనపు భారం అవుతుంది.

సౌర, పవన విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో మోసాలు జరిగాయని, వాటిని సమీక్షించాలంటూ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడే మీరు ప్రకటించగా పిపిఎలను ముట్టుకోవడానికి వీలు లేదన్నట్టు కేంద్ర విద్యుత్ మంత్రి ఆగమేఘాలపై

**"త్రిప్పి చూడగలరు"**

మీకు లేఖ రాశారు. అనంతరం పిపిఎలపై హైకోర్టులో, అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో వివాదాలు నడుస్తున్నాయి. పిపిఎల విషయంలో రాష్ట్రాలు జోక్యం చేసుకునే అవకాశమే లేకుండా చేసి, పెట్టుబడిదార్లకు భరోసా ఇవ్వాలన్నది కేంద్ర ప్రభుత్వ వ్యూహంగా కనిపిస్తోంది. విద్యుత్ రంగంలో జరిగే అన్ని కాంట్రాక్టుల అమలు పర్యవేక్షణకు కొత్తగా 'ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అథారిటీ'ని ఏర్పాటు చేయాలని సవరణల్లో ప్రతిపాదించారు. విద్యుత్ కొనుగోలు, ప్రసార, పంపిణీ కాంట్రాక్టులన్నిటి వ్యవహారాలు ఈ అథారిటీ పరిధిలో మాత్రమే వుంటాయని పేర్కొంది. ఈ అథారిటీని కేంద్రమే నియమిస్తుంది. ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమీషన్ (ఇ.ఆర్.సి) లకు సభ్యులను, ఛైర్మన్లనూ రాష్ట్ర ప్రభుత్వాలు నియమిస్తుండగా ఇకపై కేంద్ర ప్రభుత్వమే వారినీ నియమిస్తుందని మరో సవరణ తెచ్చారు.

ప్రస్తుతం దేశంలోని వివిధ ప్రాంతాల్లో వినియోగం, ఉత్పత్తినిబట్టి ఫ్రీక్వెన్సీని నిలబెట్టుకుంటూ విద్యుత్ సరఫరా చేయడం జాతీయ గ్రిడ్ పని. ఇకపై ఆయా డిస్కాములు లేదా రాష్ట్రాలు ఏ ఒక్క ఉత్పత్తిదారుకు బకాయి పడినా సరఫరా నిలిపివేసే పని కూడా గ్రిడ్‌దేనట. తద్వారా రాష్ట్ర, ప్రాంతీయ "డిశ్పాచ్ సెంటర్లపై" కేంద్రానికి పూర్తి అధికారం వస్తుంది. వారి ప్రాధాన్యతలనుబట్టి వ్యవహరించడంవల్ల రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్‌కోపై ప్రతికూల ప్రభావం తీవ్రంగా ఉంటుంది.

డిస్కామ్‌లు తమ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ పంపిణీని ఫ్రాంచైజీలకు అప్పగించవచ్చంటూ కేంద్రం ప్రైవేటుకు తలుపులు తెరుస్తోంది. లాభదాయకమైన సర్వీసులుండే పరిమిత ప్రాంతంలో పంపిణీని ఫ్రాంచైజీ పేరిట అప్పగించి ప్రైవేటు వారికి లబ్ది చేకూరుస్తారన్నమాట. ఇటువంటి చర్యలతో డిస్కాములను ముంచేసి 'అదిగో ప్రభుత్వ రంగం తెల్ల ఏనుగు' అంటారు. ఇలా ప్రతి అంశంలోనూ పెట్టుబడిదార్లకు భరోసా కల్పించేందుకు, సామాన్య వినియోగదారులకున్న రక్షణలు తొలగించేందుకు లేదా తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం సవరణలను రూపొందించిందన్నది సుస్పష్టం. రాష్ట్రాల హక్కులపై, ఆర్థిక వనరులపైనా దాడి చేస్తోంది.

ఒకవైపు ఆర్థిక రంగం కొట్టుమిట్టాడుతుండగా, మరోవైపు దేశ ప్రజలంతా కరోనాపై పోరు సాగిస్తున్న సమయంలో సంపన్నులకు లబ్ధి చేకూరుస్తూ.. పేదలపై భారాలు మోపే కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనలను తిరస్కరించవలసిందిగా కోరుతున్నాము.

రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఈ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతున్నాము.

అభివందనములతో...

| | | |
|---|---|---|
| **(కె.రామకృష్ణ)**<br>సిపిఐ | **(పెనుమల్లి మధు)**<br>సిపిఐ(యం) | సం/-<br>**(వై.సాంబశివరావు)**<br>సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ |
| సం/-<br>**(జాస్తి కిషోర్‌బాబు)**<br>సిపిఐ(యంఎల్) | సం/-<br>**(కాటం నాగభూషణం)**<br>యంసిపిఐ(యు) | సం/-<br>**(బి.బంగార్‌రావ్)**<br>సిపిఐ(యంఎల్) లిబరేషన్ |

| | | | |
|---|---|---|---|
| సం/-<br>**(చిట్టిపాటి వెంకటేశ్వర్లు)**<br>సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ | **(బి.ఎస్. అమర్‌నాథ్)**<br>యస్‌యుసిఐ(సి) | **(పి.వి.సుందరరామరాజు)**<br>ఫార్వర్డ్‌బ్లాక్ | **(జానకి రాములు)**<br>రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ |